ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 నంద్యాల జిల్లా వార్తలు


సోమవారం 20 మే 2024

ఆసక్తి చూపని ఓటర్లు

- జిల్లాలో దాదాపు రెండున్నర లక్షల మంది పోలింగ్‌కు దూరం
- అధికారులు అవగాహన కల్పించినా ఓటు వేయని వైనం
- జిల్లా కేంద్రంలోనే ఈ పరిస్థితి ఎక్కువ

నంద్యాల, మే 19 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్ర వ్యాప్తంగా ఓటింగ్ పెరిగింది. దీంతో ఓటింగ్ పట్ల ప్రజలు ఆసక్తి చూపారనే అభిప్రాయం వినిపిస్తోంది. జిల్లాలో కూడా భారీగానే పోలింగ్ నమోదైందని చెబుతున్నా.. జిల్లా వ్యాప్తంగా ఓటింగ్‌లో పాల్గొనని వాళ్ల సంఖ్య కూడా గణనీయంగానే ఉన్నట్లు తేలింది. పాణ్యం నియోజకవర్గంలోని రెండు మండలాలు మినహా మిగిలిన ఆరు నియోజకవర్గాల్లో కలిపి 13,89,307 మంది ఓటర్లు ఉన్నారు. అయితే పోలింగ్ రోజున ఓట్లేసిన వారి సంఖ్య మాత్రం 11,40,432గా ఉంది. అంటే ఏకంగా.. 2,48,875 మంది ఓటు వేసేందుకు ఆసక్తి చూపలేదు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు కొంతమంది కాగా, ఎన్నికల పట్ల ఆసక్తి చూపని యువ ఓటర్ల వల్లే ఈ ఓట్ల వ్యత్యాసం కనిపిస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.





దాదాపు 30 దేశాల్లో నిర్బంధ ఓటింగ్..

మన దేశంలో ఓటు వేయకపోయినా ఏమీ కాదు. కానీ కొన్ని దేశాల్లో ఓటు తప్పనిసరి. దాదాపు 30 దేశాల్లో నిర్బంధ ఓటు విధానం అమలులో ఉంది. బెల్జియంలో ఓటు హక్కును నాలుగుసార్లు వినియోగించుకోకపోతే పేరు తొలగించి, మళ్లీ పదేళ్ల పాటు ఓటు హక్కును నిషేధిస్తారు. జరిమానా కూడా వేస్తారు. ఇక ఫ్రాన్స్‌లో అయితే ఆస్పత్రిలో ఉన్నా ఓటు వేయాల్సిందే! లేకపోతే జరిమానా వేస్తారు. గ్రీస్ దేశంలో ఓటు వేయకపోతే డ్రైవింగ్ లైసెన్సు, పాసు పోర్టు రద్దు చేస్తారు. బొలీవియాలో ఓటు వేసిన వారికి గుర్తింపు కార్డు జారీ చేస్తారు. అది ఉన్నవారికే విద్యుత్, రేషన్, తాగునీరు వంటి ప్రభుత్వ పథకాలు అందజేస్తారు. ఇక ఇటలీలో ఓటు వేయడం పౌరుల విధిగా రాజ్యాంగంలో పొందుపరిచారు. ఓటు వేయని వారి పేర్లు అక్కడి పోలింగ్ కేంద్రాల్లో, పోలీసులు జారీ చేసే అన్ని పత్రాల్లో పొందుపరుస్తారు. దీంతో ఇక్కడ వంద శాతం పోలింగ్ జరుగుతుంది. ఇక అస్ట్రేలియా, చిలీ వంటి దేశాలు కూడా పోలింగ్‌లో ముందుంటాయి. కానీ మన దేశంలో 90 శాతం పోలింగ్ నమోదవుతుంది.



అక్కడ అలా.. ఇక్కడ ఇలా

జిల్లా వ్యాప్తంగా ఓటర్లు అధిక సంఖ్యలో ఉన్న నియోజకవర్గం నంద్యాల. ఇక్కడ మొత్తం ఓటర్ల సంఖ్య 2,73,938. ఇక ఆ తర్వాత బనగానపల్లెలో 2,41,179, తర్వాత ఆళ్లగడ్డలో 2,32,676, డోన్‌లో 2,27,351, నందికొట్కూరు 2,18,047, ఇక చివరగా శ్రీశైలంలో 1,96,116 మంది ఓటర్లు ఉన్నారు. అయితే నంద్యాలలో అత్యధిక ఓటర్లు ఉన్నా, ఇక్కడ ఓటింగ్ శాతం మాత్రం జిల్లాలోని మిగతా నియోజకవర్గాలతో పోల్చుకుంటే చాలా తక్కువగా ఉంది. అసలు మిగతా నియోజకవర్గాలతో పోల్చి చూస్తే నంద్యాల నియోజకవర్గం కనీసం దరిదాపుల్లో కూడా లేదు. జిల్లాలో అత్యధికంగా నందికొట్కూరులో 84.79 శాతం ఓటింగ్ నమోదు కాగా, బనగానపల్లెలో 84.52 రెండో స్థానంలో, ఆళ్లగడ్డ 84.06 శాతంతో మూడో స్థానంలో ఉంది. అయితే నంద్యాల మాత్రం 74.90 శాతంతో అట్టడుగు స్థానంలో ఉంది. ఓటింగ్ శాతం పరంగా మొదటి స్థానంలో ఉన్న నియోజకవర్గాలతో పోల్చి చూస్తే నంద్యాల నియోజకవర్గంలో ఓటింగ్ దాదాపు 10 శాతం తక్కువ. మొత్తంగా చూస్తే 25 శాతం తక్కువ. ఇంత తక్కువ శాతం పోలింగ్ నమోదవటం రాజకీయ నాయకులకే కాదు సామాన్యులకు ఆశ్చర్యాన్ని కలుగజేస్తోంది. జిల్లాలోని వారంతా ఉద్యోగ, ఉపాధి, వ్యాపార, చదువు రీత్యా ఇతర ప్రాంతాల్లో ఉన్నారు కాబట్టి, ఓటింగ్‌కు రాలేదని సర్ది చెప్పుకున్నా, మిగతా చోట్ల పోలింగ్ బాగానే జరగడంతో తేడా ఎక్కడుందన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. పైగా పోలింగ్ బాగా జరిగిన మిగతా ప్రాంతాలతో పోల్చుకుంటే నంద్యాలకు అటు రవాణా పరంగా సౌకర్యాలు మెరుగ్గా ఉన్నాయి. కేవలం ఓటింగ్‌పై ఆసక్తి లేకపోవటమే నంద్యాలలో ఓటింగ్ శాతం తక్కువగా ఉండటానికి కారణమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కారణాలు ఇవేనా..

ఒకప్పుడు ఓటును హక్కని, దాన్ని కచ్చితంగా వినియోగించుకోవాలని ఓటర్లు భావించేవారు. మారిన రాజకీయ పరిస్థితులకు తోడు, ఎవరికి ఓటు వేసినా ఒకటే అనే భావన ఓటరులో అనాసక్తిని పెంచింది. ఇక ఒకప్పటితో పోల్చుకుంటే ఉద్యోగ, ఉపాధి, చదువు నిమిత్తమంటూ ఆయా ప్రాంతాల ప్రజలు ఇతర ప్రాంతాలకు తరలివెళుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఓటును వినియోగించుకునేందుకు ఎక్కడెక్కడి నుంచో తమ సొంత ప్రాంతాలకు వచ్చేందుకు ఓటర్లు పెద్దగా ఆసక్తి కనబరచడం లేదు. ఇందువల్లే జిల్లాలో దాదాపు రెండున్నర లక్షల మంది తమ ఓటు హక్కు వినియోగించుకోలేకపోయారన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఇక కొంతమంది ఇక్కడే ఉంటున్నా ఓటు తమకు సంబంధం లేని విషయంగా భావిస్తున్నారు. దీనికి కూడా కారణం లేకపోలేదు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఓటు వేయకపోయినా పట్టించుకుని అడిగే వారు ఉండరు. అదే స్థానిక సంస్థల ఎన్నికల్లో అయితే ఆయా వార్డు, గ్రామ పోటీదారులు ఓటు వేయని వారిని గుర్తు పెట్టుకుంటే, భవిష్యత్తులో ఏమైనా ఇబ్బందులు తలెత్తుతాయన్న ఓ రకమైన భయంతో ఓట్లు వేస్తారు. అందుకే స్థానిక సంస్థల ఓటింగ్‌కు, సార్వత్రిక ఎన్నికలకు మధ్య ఓటింగ్ వ్యత్యాసముంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఓటర్లు, ఓటింగ్ వివరాల (2024 ఎన్నికలు)

	జిల్లాలో మొత్తం ఓటర్లు				జిల్లాలో పోలైన ఓట్లు				
నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	శాతం
ఆళ్లగడ్డ	114955	117709	12	232676	97494	98082	6	195582	84.06
శ్రీశైలం	95771	100301	44	196116	80355	82379	26	162760	82.99
నందికొట్కూరు(ఎస్సీ)	106689	111340	18	218047	91934	92946	12	184892	84.79
నంద్యాల	132992	140856	90	273938	99744	105391	55	205190	74.90
బనగానపల్లె	118112	123043	24	241179	100548	103286	5	203839	84.52
డోన్	111883	115398	70	227351	93763	94372	34	188169	82.77
మొత్తం	**680402**	**708647**	**258**	**1389307**	**563838**	**576456**	**138**	**1140432**	**82.09**



మహిళల ఓటింగే తక్కువ..

రాష్ట్ర వ్యాప్తంగా మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. జిల్లాలో కూడా మహిళా ఓటర్లు అధికంగానే ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 6,80,402 మంది పురుష ఓటర్లు ఉండగా, 7,08,647 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఈ లెక్కన 28,245 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఇక రాష్ట్ర వ్యాప్తంగా మహిళా ఓటర్లే బయటకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అయితే జిల్లాలో మాత్రం ఇది రివర్స్‌లో ఉంది. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో 5,63,838 మంది పురుషులు తమ ఓటు హక్కును వినియోగించుకోగా, 5,76,456 మంది మహిళలు బయటకు వచ్చి ఓటు వేశారు. ఓటు హక్కు ఉన్న మహిళలకు, ఓటు హక్కు వినియోగించుకున్న మహిళల మధ్య వ్యత్యాసం 1,32,191 ఉండగా, ఓటింగ్ శాతం 81.34గా నమోదైంది. ఇక ఓటు హక్కు ఉన్న పురుషుల సంఖ్యకు, ఓటింగ్ పాల్గొన్న పురుష సంఖ్యకు మధ్య వ్యత్యాసం 1,16,564 కాగా, ఓటింగ్ శాతం 82.86గా ఉంది. వెరసి ఓటు హక్కు వినియోగించుకున్న పురుషులకు, మహిళలకు మధ్య వ్యత్యాసం 1.52 శాతం ఉంది. మహిళా ఓటర్లకు, ఓటింగ్‌లో పాల్గొన్న వారి మధ్య తేడా నంద్యాల నియోజకవర్గంలో ఎక్కువగా ఉండగా, శ్రీశైలం నియోజకవర్గంలో ఈ వ్యత్యాసం తక్కువగా నమోదైంది. నంద్యాల నియోజకవర్గానికి సంబంధించి 35,465 మంది మహిళలు ఓటు హక్కుకు వినియోగించుకోకపోగా, శ్రీశైలంలో 17,922 మంది మహిళలు ఓటును వేయలేదు. మహిళా ఓటింగ్‌లో ఈ స్థాయిలో తేడా ఉన్నా ఆయా రాజకీయ పార్టీలు మాత్రం మహిళా ఓటింగ్ పెరిగిందనడం గమనార్హం.

నమ్మించి ముంచాడు..!

- నకిలీ బంగారు నగలతో బ్యాంకు రుణాలు
- రైతుల ఖాతాల పేరు మీద మంజూరు
- వడ్డీ కట్టాలని ఫోన్లు చేయడంతో వెలుగులోకి..
- మోసగాడి ఫోన్ స్విచ్ఛాఫ్.. గగ్గోలు పెడుతున్న బాధితులు



ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు

మద్దికెర, మే 19: బ్యాంకులో కాంట్రాక్టు బేసిక్ పని చేసే ఓ వ్యక్తి ఖాతాదారులను బురిడీ కొట్టించాడు. నకిలీ బంగారుతో రూ.14 లక్షల మేర మోసానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని పెరవలి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని పెరవలి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో పత్తికొండకు చెందిన ఓ వ్యక్తి కాంట్రాక్టు బేసిక్ కింద పని చేస్తున్నాడు. బ్యాంకులో బంగారు తూకం వేసి రుణాలు ఇప్పించడం ఇతని పని. దీంతో ఖాతాదారులకు ఇతను బాగా పరిచయస్తుడిగా మారాడు. ఈ క్రమంలోనే ఆయా గ్రామాల రైతులకు మాయ మాటలు చెప్పి నమ్మించాడు. తన వద్ద ఉన్న బంగారు నగలను బ్యాంకులో తనఖా పెట్టి మీ బ్యాంకు పాసుపుస్తకంపై రుణం తీసుకుంటానని చెప్పాడు. దీంతో తెలిసిన వ్యక్తే కదా అని రైతులు అందుకు ఒప్పుకున్నారు. దీంతో సదరు వ్యక్తి నకిలీ బంగారు నగలను బ్యాంకులో పెట్టి రైతుల ఖాతాల పేరు మీద రుణం మంజూరయ్యేలా చేశాడు. ఆ తరువాత రైతులు వారి ఖాతాల్లో జమ అయిన డబ్బును తీసి ఇచ్చారు. అలా 14 మంది రైతుల నుంచి నకిలీ బంగారు పెట్టి దాదాపు రూ.20 లక్షల మేర రుణం తీసుకున్నాడు. ఈ తతంగమంతా దాదాపు 8 నెలలకు పైగా జరిగింది. అయితే వడ్డీ చెల్లించాలంటూ బ్యాంకు వారు ఖాతాదారులకు ఫోన్ చేయగా ఈ వ్యవహారమంతా బయట పడింది. దీంతో బ్యాంకులో పని చేస్తున్న సదరు వ్యక్తి వారం రోజుల నుంచి సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకొని ఉడాయించాడు. బ్యాంక్ వాళ్లేమో రుణాలు జమ అయిన ఖాతాదారులే వడ్డీ చెల్లించాలని చెబుతున్నారు. దీంతో బాధితులు గగ్గోలు పెడుతున్నారు. తెలిసిన వ్యక్తి కదా అని ఒప్పుకుంటే ఇలా ముంచుతాడని అనుకోలేదని వాపోతున్నారు. అయితే బాధితులు ఉడాయించిన వ్యక్తి కుటుంబ సభ్యులను కలవగా ఆ డబ్బును తాము చెల్లిస్తామని చెప్పినట్లు తెలిసింది. ఈ విషయంపై బ్యాంకు మేనేజర్ హరీష్‌ను వివరణ కోరగా.. బ్యాంకులో మోసం జరిగిన మాట వాస్తవమేనని, విచారణ చేస్తున్నామని, ఇప్పటి వరకు రూ.14 లక్షలు మోసం చేసినట్లు గుర్తించామని వివరణ ఇచ్చారు.

పత్తి విత్తనాల ధర పెంపు

- గత సంవత్సరంతో పోలిస్తే ప్యాకెట్‌పై రూ.13 పెరిగిన ధర
- ఉమ్మడి జిల్లా రైతులపై పెరిగిన భారం



పత్తి విత్తనాల నిల్వలు

కర్నూలు(అగ్రికల్చర్), మే 19: రాష్ట్రంలోనే అత్యధికంగా పత్తి పంటను గత దశాబ్ద కాలంగా సాగు చేస్తున్న రైతులపై మరోసారి మోయలేని భారం పడింది. ప్రకృతి వైపరీత్యాలు, పాలకుల నిర్లక్ష్యంతో పత్తి రైతు గత కొన్ని సంవత్సరాలుగా నష్టాల ఊబిలోకి కూరుకుపోతున్నారు. ప్రస్తుతం ఈ నష్టాలకు తోడు పత్తి విత్తనాల ధరను పెంచుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో ఒక ప్యాకెట్ విత్తనాలపై రూ.13 దాకా అదనంగా రైతులు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో దాదాపు రెండున్నర లక్షల హెక్టార్లలో రైతులు పత్తి పంటను సాగు చేస్తున్నారు. ఎకరాకు 3 ప్యాకెట్ల పత్తి విత్తనాలు అవసరమవుతాయి. ఈ లెక్కన ఉమ్మడి కర్నూలు జిల్లాకు దాదాపు 20 లక్షల ప్యాకెట్ల పత్తి విత్తనాలు అవసరమని వ్యవసాయ శాఖ అధికార వర్గాలు తెలిపాయి. గత సంవత్సరం ప్యాకెట్ పత్తి విత్తనాల ధర రూ.853 ఉండగా.. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో రూ.864కు పత్తి విత్తనాల కంపెనీల యజమాన్యాలు పెంచుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. దీంతో పత్తి రైతులు అదనంగా రూ.కోట్ల భారాన్ని భరించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికే కల్తీ విత్తనాల కారణంగా రైతులు భారీగా నష్టపోతున్నారు. నకిలీ పత్తి విత్తనాలను అరికట్టాల్సిన వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లుగా ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. దీంతో నకిలీ నాసిరకం పత్తి విత్తనాలను వ్యాపారులు, దళారులు భారీగా రైతులకు అంటగడుతూ జేబులు నింపుకుంటున్నారు.

బ్లాకులో విక్రయాలు

గుర్తింపు పొందిన పత్తి విత్తనాల కొరత ఉమ్మడి జిల్లాలో తీవ్రంగా ఉంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో ముందస్తుగా పొలాల్లో రైతులు విత్తనాలు వేసేందుకు ప్రయత్నిస్తున్నారు. వర్షాలు మొదలు కావడంతో వ్యాపారులు ప్రముఖ కంపెనీల పత్తి విత్తనాల ధరను భారీగా పెంచుతున్నారు. ప్రస్తుతం ఒక ప్యాకెట్ పత్తి విత్తనాల ధర రూ.864 కాగా, బ్లాక్ మార్కెట్‌లో రూ.900 నుంచి రూ.1000 వరకు అధిక ధరను నిర్ణయించి డీలర్లు రైతులకు అమ్ముతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. ఎమ్మిగనూరు, పత్తికొండ, కర్నూలు, ఆలూరు, డోన్, పాణ్యం తదితర నియోజకవర్గాల్లో గుర్తింపు పొందిన పత్తి విత్తనాలను కొనుగోలు చేసేందుకు ఎమ్మార్పీ ధర కంటే రూ.200 పైగానే చెల్లించేందుకు రైతులు సిద్ధం కావడం విశేషం. ఎకరాకు రెండు ప్యాకెట్ల విత్తనాలు అవసరం కాగా, మూడు ప్యాకెట్ల వరకు రైతులు కొంటున్నారు. డీలర్లు అధిక ధరలు వసూలు చేయకుండా ప్రభుత్వం కంట్రోల్ చేయాలని రైతులు కోరుతున్నారు.

2019 నుంచి 2024 వరకు పత్తి విత్తనాల ప్యాకెట్ ధరల వివరాలు

సంవత్సరం	ధర (రూ.లలో)
2019	రూ.710
2020	రూ.730
2021	రూ.767
2022	రూ.810
2023	రూ.853
2024	రూ.864

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో

మృతదేహాల కలకలం

- గార్గేయపురం చెరువులో లభ్యమైన ముగ్గురు మహిళల మృతదేహాలు
- ఘటనా ప్రాంతాన్ని పరిశీలించిన డీఐజీ, ఎస్పీ



ఘటనా స్థలాన్ని పరిశీస్తున్న పోలీసులు



కర్నూలు(ఎడ్యుకేషన్), మే 19: కర్నూలు మండలం నందికొట్కూరు రహదారిలోని గార్గేయపురం చెరువులో ఆదివారం మూడు మృతదేహాలు బయటపడ్డాయి. దీంతో గార్గేయపురం గ్రామంలో ఒక్కసారిగా కలకలం రేగింది. స్థానికులు కొంతమంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. తాలుకా సీఐ శ్రీధర్, ఎస్ఐ పీరయ్యలు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇద్దరు మహిళల మృతదేహాలు బోర్లబొక్కలా ఉండి నీటిలో తేలియాడుతూ కనిపించాయి. స్థానికుల సాయంతో మృతదేహాలను బయటకు తీశారు. మృతదేహాల శరీరంపై లంగా, రవికలు మాత్రమే ఉన్నాయి. ఒక మహిళ మెడలో పూసల హారం ఉంది. ఓ మహిళ చేతికి పచ్చ బొట్టు ఉంది. మొదట హిజ్రాలుగా అనుమానించిన పోలీసులు సమీపంలోని హిజ్రాలను పిలిపించి మృతదేహాలను పరిశీలించారు. చివరకు వారు హిజ్రాలు కాదని నిర్ధారించారు. ఒక మృతురాలి వయస్సు 40 నుంచి 45 ఏళ్లు, మరో ఇద్దరి మహిళల వయస్సు ఇంచుమించు 30 నుంచి 35 ఏళ్లు ఉంటుందని భావించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఒక్కసారిగా ముగ్గురు మహిళల మృతదేహాలు లభ్యం కావడంతో పోలీసులు ఖంగుతిన్నారు. స్థానికులు ఆందోళనకు గురయ్యారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఐజీ, ఎస్పీలు

ముగ్గురు మహిళల మృతదేహాలు లభ్యం కావడంతో పోలీసు శాఖలో కలవరం నెలకొంది. కర్నూలు రేంజ్ డీఐజీ విజయరావు, ఎస్పీ జి.కృష్ణకాంత్ పోలీసు బృందాలతో అక్కడకు వెళ్లారు. మృతదేహాలు లభ్యమైన ప్రాంతాలను పరిశీలించారు. ఆ మృత దేహా లు ఎవరివనే కోణంలో విచారించాలని పోలీసు కింది స్థాయి అధికారులను ఆదేశించారు. చెరువు, పక్కనే ఉన్న సిటీ ఫారెస్టు ప్రాంతాలను గాలించారు. మరెక్కడా ఇతర అనుమానాస్పద ఆధారాలు లభ్యం కాలేదు. అన్ని కోణాల్లో విచారించాలని ఆదేశించారు.

ఇద్దరు మహిళలు మహబూబ్‌నగర్ జిల్లా వాసులు

మృతి చెందిన ముగ్గురు మహిళల్లో ఓ ఇద్దరు మహబూబ్‌నగర్ జిల్లా వాసులుగా పోలీసులు గుర్తించారు. ఘటనా స్థలం పరిశీలించిన అనంతరం డీఐజీ, ఎస్పీలు ఈ కేసు దర్యాప్తు కోసం మూడు టీమ్‌లను నియమించారు.



మూడు టీమ్‌లు నగరంలో ఉన్న బ్రోతల్ హౌస్ నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నాయి. దీంతో మృతి చెందిన ఇద్దరు మహిళలను మమత అనే బ్రోతల్ నిర్వాహకురాలు గుర్తు పట్టింది. పూర్తి వివరాలను పోలీసులు సోమవారం వెల్లడించే అవకాశం ఉంది.

ఉల్లి ఆశ...

- ఖరీఫ్ ప్రారంభంలోనే సాగుచేస్తున్న రైతన్న
- బావులు, బోర్లకింద ఐదువందల ఎకరాల్లో
- చేతికందే సమయానికి ధర వస్తుందనే ఆశ



బోర్ల దగ్గర సాగు చేసిన ఉల్లి

గోనెగండ్ల మే 19: ఉల్లి పంటపై రైతులు చాలా ఆశ పెట్టుకున్నారు. ఉల్లి ఒకసారి దగా చేసినా మరోసారి ఆదుకుంటుందని రైతుల నమ్మకం. ఒక్కసారి ఉల్లి ధర పలికితే చాఀ. గత ఏడాది నష్టం కూడా తీరి లాభాలు వస్తాయని ఎప్పటిలాగే ఈసారి కూడా సాగు చేశారు. గత రబీ సీజన్‌లో ఉల్లి పంటను సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. క్వింటం ధర రూ. 800 నుంచి రూ. 500 మాత్రమే పలికింది. దీంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. అయినప్పటికి ఈ ఖరీఫ్ సీజన్‌లో ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని గ్రామాల్లో చాల మంది రైతులు బావులు, బోర్ల కింద ఉల్లి పంటను సాగుచేస్తున్నారు. వర్షం రెండుసార్లు కురియడంతో భూమి చల్లబడి రైతులు ఉల్లి పంటను సాగు చేస్తున్నారు. ఈసారి ఉల్లి పంట చేతికి అందే సమయానికల్లా ఉల్లి పంటకు గిట్టుబాటు ధర లభిస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గోనెగండ్ల, ఎమ్మిగనూరు, నందవరం, మండలాల పరిధిలో ఇప్పటికే బావులు, బోర్ల కింద దాదాపు ఐదు వందల ఎకరాల్లో ఉల్లి పంట సాగు చేశారు. కొంద మంది రైతులు ఉల్లినారును సైతం అమ్మకానికి సిద్ధంగా ఉంచారు.

గత ఏడాది నష్టల బాటలో

గత రబీ సీజన్‌లో ఉల్లి పంట సాగుచేసిన రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది. పెట్టుబడులు రాక చివరికి రవాణా ఖర్చులు సైతం అందక అప్పులపాలయ్యారు. క్వింటం రూ 800 నుంచి రూ. 500 పలకడంతో ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో దాదాపు రూ. 5 కోట్ల మేర పంట నష్టం వాటిల్లిన ట్లు సమాచారం. గోనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరు, మండలాల్లో చాల మంది రైతులు ఉల్లి పంటను పొలంలోనే మూగజీవాలకు వదిలేశారు. ట్రాక్టర్‌తో దున్నేశారు.



గోనెగండ్లలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఉల్లి నారు

ఒక ఎకరంలో ఉల్లి సాగు చేశాను



పోయిన ఏడాది 2 ఎకరాల్లో ఉల్లి పంటను సాగుచేసి దాద్పాపు రూ. 1.50 లక్షలు నష్టపోయాను. కనీసం పెట్టుబడులు కూడా అందలేదు. ఈసారైనా గిట్టుబాలు ధర లభిస్తుందని నమ్మకంతో ఒక ఎకరంలో ఉల్లి పంటను సాగు చేశాను. **-ఉరుకుంద రెడ్డి, వేముగోడు రైతు**

గిట్టుబాటు లభిస్తుందన్న ధీమా

జిల్లాలో ఎమ్మిగనూరు. మంత్రాలయం, ఆదోని ప్రాంతాలలో ఉల్లి పంట అధికంగా సాగు చేస్తారు. పంట చేతికి అందే సమయానికి ఉల్లి నిల్వలు చెప్పుకోదగ్గ స్థాయిలో ఉండవని, ఆ సమయంలో ఇతర రాష్ట్రాల నుండి కూడా ఉల్లి నిల్వలు రావడానికి ఆలస్యం అవుతుంది కాబట్టి ముందుగా మార్కెట్‌లోకి చేరే పంటకు డిమాండ్ ఉంటుందని రైతులు ఆశిస్తున్నారు.

పొలంలోనే ఊపిరి వదిలిన రైతు



రామచంద్ర (ఫైల్)

పత్తికొండ టౌన్, మే 19: ఓ రైతు తన పొలంలోనే గుండె ఆగి మృతి చెందిన సంఘటన ఆదివారం పత్తికొండ మండలం చిన్నహుల్తి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల ఇలా ఉన్నాయి. చిన్నహుల్తి గ్రామానికి చెందిన కప్పట్రాళ్ల రామచంద్ర (52) అను రైతు తనకున్న మూడెకరాల సొంత పొలంతో పాటు మరో మూడెకరాలు కౌలుకు తీసుకుని సాగు చేసుకున్నాడు. అయితే.. ఏటా వ్యవసాయం చేసినా అప్పులు అంతంకంతకూ పెరుగుతూ వచ్చాయి. అయితే.. పెట్టిన పెట్టుబడులు చేతికందక పండిన పంటలకు గిట్టుబాటు ధర లేక రామచంద్ర అప్పుల ఊబిలో కూరుకుపోయాడు. చేసిన అప్పులు ఎలా తీర్చాలంటూ మనోవేదన చెందుతున్న రామచంద్ర ఉదయాన్నే గ్రామానికి సమీపంలో ఉన్న పొలంలో వ్యవసాయ పనులకు వెళ్లాడు. అక్కడే రైతు గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు ఆయన్ను పత్తికొండ ఆసుపత్రికి తీసుకురాగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రైతుకు భార్య చిట్టెమ్మతోపాటు ముగ్గురు సంతానం. ఇంటి పెద్ద దిక్కు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరును పలువురిని కంటతడి పెట్టించింది.

అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కేసులు

కలెక్టర్ డాక్టర్ సృజన



గుడికంబాలి రీచ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన

కౌతాళం, మే 19: అనుమతులు లేనిదే ఇసుకను నదుల నుంచి తరలిస్తే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని కలెక్టర్ డాక్టర్ సృజన తెలిపారు. మండల పరిధిలోని గుడికంబాలి, మరళి ఇసుక రీచ్‌లను ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సృజన మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు నదులలో ఎట్టి పరిస్థితుల్లో యంత్రాలతోగాని, వేరే ఇతర సామగ్రితోగాని నది నుంచి ఇసుకను తరలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. మరళి ఇసుక రీచ్ కర్ణాటక సరిహద్దులో ఇసుకను తోడుతున్న యంత్రాన్ని ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ స్వామి గుర్తించి సీజ్ చేయాలని పోలీసులను ఆదేశించి అక్కడ నుంచి వెళ్లిపోయారు. కౌతాళం పోలీసులు, రెవెన్యూ అధికారులు యంత్రం వద్దకు పోగా యంత్రం ఉన్న ప్రాంతం కర్ణాటక కావడంతో ఆ రాష్ట్ర అధికారులకు సమాచారం అందించి ఇక నుంచి తమ సరిహద్దుల్లోకి వస్తే కేసులు నమోదు చేస్తామని కోసిగి సీఐ ప్రసాద్ తెలిపారు. వీరి వెంట కౌతాళం తహసీల్దార్ అలెగ్జాండర్, ఆర్ఐ రాజశేఖరగౌడ్, ఇరిగేషన్ అధికారులు, ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి ఉన్నారు.

మిద్దెపై నుండి పడి వ్యక్తి మృతి

భార్య, బంధువులపై తండ్రి ఫిర్యాదు

ఆలూరు, మే 19: ఆలూరు మండలం అరికెర గ్రామంలో ఆదివారం పాండురంగ (40) మిద్దె మీది నుంచి పడి మృతి చెందాడు. మృతుడికి భార్య తిరుమలమ్మ, ఏడేళ్ల కుమారుడు ఉన్నారు. అయితే తన కుమారుడు మృతికి భార్య, ఆమె బంధువులు కారణం అంటూ మృతుడి తండ్రి గోవింద్ ఆలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి విచారణ చేపట్టనున్నారు.

రాఘవేంద్ర స్వామి మఠానికి 1.5 కేజీల వెండి పాదుకల విరాళం

మంత్రాలయం, మే 19: రాఘవేంద్రస్వామి మఠానికి బెంగుళూరులోని రామ్‌నగర్‌కు చెందిన కుశలత అనే భక్తుడు ఒకటిన్నర కేజీ విలువ చేసే వెండితో తయారు చేయించిన పాదుకలను విరాళంగా ఇచ్చినట్లు మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి తెలిపారు. ఆదివారం ఏకాదశిని పురస్కరించుకొని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులకు వెండి పాదుకలను అందజేశారు. ఈ వెండి పాదుకలు రాఘవేంద్రస్వామి మూల బృందావనం ముందు ఉంచి పూజలు చేయాలని దాత కోరారు. విరాళం ఇచ్చిన దాతల కుటుంబానికి పీఠాధిపతి ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమంలో క్యాషియర్ దేశాయ్ నరసింహ స్వామి, అనంతపురాణిక్, వ్యాసరాజాచార్, జయతీర్థాచార్ పాల్గొన్నారు.

నేడు ఇంటర్ పరీక్షల ఫీజుకు ఆఖరు

కర్నూలు(ఎడ్యుకేషన్), మే 19: ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లింపునకు సోమవారం చివరి గడువు అని ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి ఆదివారం తెలిపారు. సోమవారం సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్ ద్వారా తాత్కాలిక ఫీజు రూ.3వేలు చెల్లించాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

ఎయిడ్స్ బాధను నయం చేద్దాం

క్యాండిల్ ర్యాలీ నిర్వహించిన ఎయిడ్స్ నివారణ సంస్థ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య అధికారులు

కర్నూలు(హస్పిటల్), మే 18: అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ స్మారక దినం సందర్భంగా ఆదివారం రాత్రి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా క్షయ నివారణ సంస్థ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. జిల్లా క్షయ నియంత్రణ కేంద్రం వద్ద ఈ ర్యాలీని డిస్ట్రిక్ట్ టీబీ ఆఫీసర్ డా.ఎల్.భాస్కర్ ప్రారంభించారు. అనంతరం ర్యాలీ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి పరిపాలన విభాగం వరకు కొనసాగింది. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 12,030 మంది క్రమం తప్పకుండా 4 ఏఆర్‌టీ కేంద్రాలు, 9 లింక్ ఏఆర్‌టీ కేంద్రాల ద్వారా బాధితులు ఉచితంగా మందులు వాడుతున్నారన్నారు. అలాగే గత ఏడాది హెచ్ఐవీ, ఇతర వ్యాధులతో 56 మంది చనిపోయారనీ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని ఇవ్వడం కోసం ఈ ర్యాలీ ఏటా నిర్వహిస్తున్నామన్నారు. ఆదోని, నంద్యాల ఏఆర్‌టీలకు సీడీ4 పరీక్ష చేసే అధునాతన యంత్రం జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ మంజూరు చేసిందని త్వరలో వీటిని బాధితులకు అందుబాటులోకి తీసుకుని వస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నివారణ విభాగం మేనేజర్ అలీహైదర్, దేవి శంకర్‌గౌడు, క్షయ నివారణ వైద్యాధికారి మల్లికార్జున రెడ్డి, ఏఆర్‌టీ వైద్యాధికారి రాధిక, నేస్తం పాజిటివ్ నెట్‌వర్క్ అధ్యక్షురాలు సుధారాణి, ఉద్యోగులు పాల్గొన్నారు.

రెండు విడతలుగా కౌంటింగ్‌కు శిక్షణ

కలెక్టర్ డా.జి.సృజన

కర్నూలు(కలెక్టరేట్), మే 19: ఈ నెల 24, 31వ తేదీల్లో కౌంటింగ్ సిబ్బందికి రెండు విడతలుగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి.సృజన రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఢిల్లీ నుంచి కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు అన్ని రాష్ట్రాల ఆర్వోలకు కౌంటింగ్‌కు సంబంధించి డౌట్ క్లియరింగ్ సెషన్స్ నిర్వహించారు. ఈ నిర్వహణకు కలెక్టర్, ఆర్వోలు, ఏఆర్వోలు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ ఆర్వోలు, ఏఆర్వోలతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడుతూ డౌట్ క్లియరింగ్ సెషన్స్‌లో నిర్దేశించిన 17సీ, పీవో డైరీ, 17ఏ తదితర డాక్యుమెంట్లు అన్ని సిద్దంగా ఉంచుకోవాలని రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. కంపెడీయం ఆఫ్ ఇన్‌స్ట్రక్షన్స్, ఈసీఐ నుంచి ఈ నెల 20, 24వ తేదీల్లో వచ్చిన ఇన్‌స్ట్రక్షన్స్, ఆర్వో హ్యాండ్ బుక్, అబ్జర్వర్ హ్యాండ్ బుక్‌లో ఉండే కౌంటింగ్‌కు సంబంధించిన సూచనలను ఆర్వోలు, ఏఆర్వోలు క్షుణ్ణంగా చదవాలన్నారు. ఆర్వో స్థాయిలో కూడా తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు టేబులేషన్ విధులు నిర్వహించే సిబ్బందితో డౌట్ క్లియరింగ్ సెషన్స్ నిర్వహించుకోవాలన్నారు. 22న పొలిటికల్ పార్టీలతో సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్‌లో పాణ్యం ఆర్వో, జేసీ నారపు రెడ్డి మౌర్య, కర్నూలు ఆర్వో మున్సిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని ఆర్వో, సబ్ కలెక్టర్ శివ్‌నారాయణశర్మ, ఇతర నియోజకవర్గాల ఆర్వోలు, ఏఆర్వోలు, స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

కెమెరా ట్రాప్‌లో పెద్దపులి



నల్లమలలో పిల్లలతో ఆడ పెద్దపులి

రుద్రవరం, మే 19: నల్లమల అడవిలో ఇటీవల ఆడ పెద్దపులి తన పిల్లలతో కెమెరా ట్రాప్‌లో కనిపించింది. మూడు పిల్లలతో కలిసి సాసర్‌ఫీట్ వద్ద కెమెరాకు చిక్కింది. రెండు పెద్ద పులి పిల్లలు ముందు భాగం కాళ్ల వద్ద, మరో పెద్దపులి పిల్ల వెనుక భాగంలో తన తల్లి వద్ద ఉన్నాయి. సాసర్‌ఫీట్‌లో నీరు తాగడానికి వచ్చి ఉంటుందని అటవీ అధికారులు భావిస్తున్నారు. సాసర్‌ఫీట్‌లో నీటి దాహాన్ని తీర్చుకుని పిల్లలు, తల్లి సరదాగా, ఉల్లాసంగా కనిపించాయి.

తీగ లాగితే డొంక కదిలింది

- మొదటి రోజు 62 మందిని విచారిస్తే రూ.3,48,215 అవినీతి బట్టబయలు

రుద్రవరం, మే 19: రుద్రవరం మండలం శ్రీరంగాపురం గ్రామంలో బ్రాంచ్ పోస్టాఫీసులో తీగ లాగితే డొంక కదిలినట్లయింది. శనివారం నంద్యాలకు చెందిన అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ సత్యనారాయణ విచారణ చేపట్టారు. మొత్తం 62 మందిని విచారిస్తే రూ.3,48,215 అవినీతి బయటపడినట్టు తేలింది. ఈ మొత్తం బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ స్వాహా చేసినట్లు విచారణలో బట్టబయలైంది. ఇంకా విచారించాల్సిన లబ్ధిదారులు చాల మంది ఉన్నారు. బ్రాంచ్ పోస్టాఫీసు పరిధిలో శ్రీరంగాపురం, దక్షిణకొట్టాలు, తుమ్మలకొట్టాల గ్రామాలు ఉన్నాయి. అందరినీ విచారిస్తే అవినీతికి పాల్పడిన సొమ్ము లక్షల్లోనే ఉంటుందని స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. నిరుపేదలు కాయ కష్టం చేసి తమ పిల్లల కోసం డబ్బు పొదుపు చేస్తే ఇలా వాడుకోవడంతో పోస్టల్ ఖాతాదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏదిఏమైనా విచారణలో మరింత అవినీతి బయటపడే అవకాశం ఉందని స్థానికంగా చర్చ.

అపరిచితులను రానివ్వొద్దు

ఎన్నికల అధికారి డాక్టర్ శ్రీనివాసులు



సీసీ కెమెరాల పుటేజీని పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి, ఎస్పీ

పాణ్యం, మే 19: మండలంలోని ఆర్జీఎం, శాంతిరాం, ఇంజనీరింగ్, ఫార్మశీ కళాశాలల్లోని ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ల సమీపంలోకి ఎవర్నీ రానివ్వవద్దని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం ఆయన స్ట్రాంగ్ రూమ్‌లకు వేసిన సీళ్లు, తాళాలు, తలుపులను, వెబ్‌కాస్ట్ అవుతున్న దృశ్యాలను కమాండ్ కంట్రోల్ ద్వారా తనిఖీ చేశారు. తనిఖీ అనంతరం సందర్శకుల రిజిస్టర్‌లో సంతకాలు చేశారు. అనధికార వ్యక్తులను స్ట్రాంగ్ రూమ్‌లు ఉన్న ప్రాంతాల్లోకి ప్రవేశించకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆయన కమాండ్ కంట్రోల్ వద్దగల సీసీ టీవీ కెమెరాలు పరిశీలించారు. స్ట్రాంగ్ రూంల వద్ద విధులు నిర్వహిస్తున్న అధికారులకు దిశానిర్దేశం చేస్తూ కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కౌంటిగ్ ప్రక్రియ ఆర్జీఎం, శాంతిరాం ఇంజనీరింగ్, ఫార్మశీ కళాశాలల్లో ఉంటుందని తెలిపారు. జిల్లాలో హింసాత్మక సంఘటనలకు పాల్పడినా, రెచ్చగొట్టే విధంగా వ్యవహరించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 144 సెక్షన్ అమలుతో ఎక్కడా నలుగురికి మించి గుంపులుగా ఉండరాదని సూచించారు. స్ట్రాంగ్‌రూం వద్ద ఏర్పాటు చేసిన మూడంచెల భద్రతా చర్యల్లో ఎలాంటి అలసత్వం ఉండరాదన్నారు. నిరంతరం సీసీ కెమెరాల పర్యవేక్షణలో పహారా ఉండాలని ఆదేశించారు. డీఎస్పీ స్థాయి అధికారి 24 గంటలపాటు భద్రతను పర్యవేక్షిస్తుంటారని చెప్పారు. విద్యుత్ అంతరాయం లేకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా పోలీసు పికెట్లు, మొబైల్ పెట్రోలింగ్ పార్టీలు నిరంతరం పని చేసేలా ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్పీ రఘువీర్‌రెడ్డి, పాణ్యం సీఐ నల్లప్ప, ఎస్ఐ అశోక్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కర్షకులను ఉత్తేజపరిచేందుకే రైతు సంబరాలు

కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్ రెడ్డి



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ప్రభాకర్ రెడ్డి

ఓర్వకల్లు, మే 19: రైతులను ఉత్తేజపరిచేందుకే ప్రతి ఏటా రైతు సంబరాలు నిర్వహిస్తున్నట్లు కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మీదివేముల గ్రామంలో పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ పోటీలకు తెలుగు రాష్ట్రాల నుంచి 16 జతల ఎద్దులు పోటీలు పాల్గొన్నాయి. పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. ఈ పోటీల్లో మొదటి విజేతగా కడప జిల్లా దాసరిపల్లె గ్రామానికి చెందిన చిన్నవీరన్న నాయుడు ఎద్దులు 6168 అడుగుల దూరం లాగి రూ.50వేల నగదును కైవసం చేసుకున్నాయి. రెండో స్థానంలో అనంతపురం జిల్లా పుల్లేరుపల్లె గ్రామానికి చెందిన పుచ్చల భాస్కర్ రెడ్డి 6163 అడుగుల దూరం లాగి రూ.40వేల నగదును, మూడో స్థానంలో కడప జిల్లా సి. కొత్తపల్లి గ్రామానికి చెందిన మామిళ్ల సుబ్బారెడ్డి ఎద్దులు 6,075 అడుగుల దూరం లాగి రూ.30వేల నగదును, నాలుగో స్థానంలో అనంతపురం జిల్లా హోసూరు మండలం పల్నాడు చెందిన గోపిరెడ్డి వెంకటరెడ్డి ఎద్దులు 6వేల అడుగుల దూరం లాగి రూ.20వేల నగదును, 5వ స్థానంలో సూర్యపేట జిల్లా రామలక్ష్మీపురం మండలం, కోదాడ గ్రామానికి చెందిన రైతు కేఎస్ రెడ్డి ఎద్దులు 5,909 అడుగుల దూరం లాగి రూ.15వేల నగదును, 6వ స్థానంలో పీఆర్‌పల్లి తాండ్రపాడు గ్రామానికి చెందిన చిన్నరత్నం, రంగనాయకుడు ఎద్దులు 5,895 అడుగుల దూరం లాగి రూ.10వేల నగదును సొంతం చేసుకున్నాయి. ఈ పోటీలకు వ్యాఖ్యాతగా వాడాల రామనాయుడు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పద్మనాభ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, సంజీవరెడ్డి, ఎర్రన్న యాదవ్, రమేష్ నాయుడు, క్రిష్టయ్య యాదవ్ పాల్గొన్నారు.

వర్షం రాకతో...

- విత్తన దుకాణాలు కళకళ
- భారీగా విత్తనాలను కొనుగోలు చేస్తున్న రైతులు



విత్తన దుకాణాల దగ్గర రైతుల సందడి

ఎమ్మిగనూరు, మే 19: తొలకరి పలుకరించడంతో రైతన్న సేద్యానికి సిద్ధమవుతున్నాడు. భూములను దుక్కులు దున్నుతూ సాగుకు సిద్ధం చేసుకుంటూ మరోవైపు సాగుచేసే పంటలకు సంబంధించిన విత్తనాలను కొనుగోలు చేసే పనిలో నిమగ్నమయ్యాడు. దీంతో ఎమ్మిగనూరు పట్టణంలోని పలు విత్తన దుకాణాలు రైతన్నలతో కళకలలాడుతున్నాయి. ఎమ్మిగనూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని నందవరం, గోనెగండ్ల, ఎమ్మిగనూరు, మంత్రాలయం మండలాల్లో దాదాపు 2లక్షల ఎకరాలకు పైగా వ్యవసాయ భూములు ఉన్నాయి. ఇందులో ప్రధానంగా పత్తిని సాగుచేసే అవకాశం ఉంది. అలాగే మిరప, వేరుశనగ, మొక్కజొన్న, వరితో పాటు ఇతర పంటలను ఓమోస్తరు సాగుచేయనున్నారు. ఇందుకుగాను రైతులు వర్షం కురిసి భూములు పదును కావడంతో విత్తనాల కొనుగోలుపై దృష్టి సారించారు. దీంతో ఎమ్మిగనూరు చుట్టుముట్టు గ్రామాల నుంచేగాక గోనెగండ్ల, ఆస్పరి, మంత్రాలయం, నందవరం, పెద్దకడుబూరు మండలాల నుంచి రైతులు భారీగా ఎమ్మిగనూరు పట్టణంలో ఉన్న విత్తన దుకాణాల్లో పత్తి, మిరప విత్తనాలతో పాటు ఇతర చిరుదాన్యాల విత్తనాల కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో పత్తికి సంబంధించి యూఎస్7067, 4708, 4753, రేవంత్, జేకె సీడ్స్, న్యూజివీడు, మైకో, రాయల్, క్రిస్టల్, అమర్ బయోటెక్, వేదా, కృషిదన్, సూపర్‌సీడ్స్ వంటి కంపెనీలకు చెందిన విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

విత్తనాలు అందుబాటులో ఉన్నాయి

రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. ప్రధానంగా రైతులు పత్తి సాగుచేసే అవకాశం ఉండడంతో ఇప్పటికే మార్కెట్‌లో దాదాపు 1.50లక్షల ప్యాకెట్లకుపైగా వివిధ రకాల కంపెనీలకు చెందిన పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నాయి.

-మహేశ్వరరెడ్డి, ఏవో

శ్రీమఠంలో నిత్య పూజలకు విరామం

మంత్రాలయం, మే 19. మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో జరిగే నిత్యపూజలకు విరామం కల్పించారు. ఆదివారం ఏకాదశి సందర్భంగా బృందావనంకు నిత్యం జరిగే అభిషేకాలు, అలంకరణ, నిత్య అన్నదానం, రథోత్సవాలు ఊరేగింపు, టెంకాయకొట్టడం, పరిమళ ప్రసాదం బంద్ చేశారు. దీంతో మఠంపీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో కేవలం బృందావనానికి నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం నిర్వహించి మూలరాములకు పూజలు చేసి మహా మంగళ హారతులు ఇచ్చి భక్తులకు తప్త ముద్రధారణ చేశారు. అలంకరణ లేని రాఘవేంద్రస్వామి నిజ బృందావనాన్ని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పీఠాధిపతి, పండితులు, అర్చకులు, శ్రీమఠం ఉద్యోగులు ఉపవాసంను పాటించారు.

భక్తుల రద్దీ : రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో శ్రీమఠం కిక్కిర్సింది. ఆదివారం సెలవు దినం కావటంతో దక్షణాది రాష్ట్రాలనుంచి వే లాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. మహాముఖద్వారం, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, తుంగభద్ర నదితీరం, మధ్వమార్గ్ కారిడార్ భక్తులతో కోలాహలంగా మారింది.



మంత్రాలయం శ్రీ మఠంలో రద్దీగా ఉన్న భక్తులు

'అధికారులు నిర్లక్ష్యం వీడాలి'



విద్యుత్ తీగలను చూపుతున్న నాయకులు, కాలనీ వాసులు

నందికొట్కూరు, మే 19: ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న విద్యుత్, మున్సిపల్ అధికారుల నిర్లక్ష్య వైఖరి విడనాడాలని ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ మెంబర్ వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం నందికొట్కూరు మున్సిపాల్టీలోని ఎస్ఎస్ఆర్ నగర్‌లో స్థానికులతో కలిసి విద్యుత్ స్తంభాలను, కరెంట్ మెయిన్ వైర్లను పరిశీలించారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నందికొట్కూరు మున్సిపాల్టీ పట్టణం అయినప్పటి నుంచి విద్యుత్, మున్సిపల్ అధికారులకు సమన్వయం లేదని, దీంతో పట్టణంలో ఇలాంటి అనేక కాలనీలో ఇప్పటికీ యాభై ఏళ్ల కిందటి స్తంభాలే ఉన్నాయని ఆరోపించారు. వాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలని ఎవరిని అడగాలో కూడా ప్రజలకు అర్థం కాని పరిస్థితి నెలకొందని అన్నారు. వర్షాకాలంలో విద్యుత్ వైర్లు తెగి ఇళ్లపై పడితే ప్రమాదం తప్పదని ఆందోళన చెందుతున్నారని అన్నారు. అధికారులు తక్షణమే స్పందించి ఈ కాలనీలోనే కాకుండా పట్టణంలోని 29వార్డులలో విద్యుత్ అధికారులు పర్యవేక్షించి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరారు. వీటికి తోడు పట్టణంలోని మెయిన్ కూడలిలో ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కవచాలు లేకుండా ఉండడంతో ఆటోలు, బైకులు బస్సులు వాహనాలు నడిపే వారికి ట్రాన్స్‌ఫార్మర్లకు తగిలే ప్రమాదం ఉందన్నారు. తక్షణమే విద్యుత్ అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని, ఈ సమస్యలను పరిష్కరించకుంటే ఆయా కాలనీవాసులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు సుధాకర్, ఎస్.మహబూబ్ బాషా, భాస్కర్ గౌడ్, ఉపేంద్ర, రామకృష్ణ, కాలనీవాసులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నంద్యాల రూరల్, మే 19: మండలంలోని చాపిరేవుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998-99 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ చాలా ఏళ్ల తర్వాత కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. పూర్వ విద్యార్థులంతా నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ సంతోషంగా గడిపారు. చదువు చెప్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, సుధాకర్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

'ప్రైవేటు విద్యా సంస్థల్లో దోపిడీని అరికట్టాలి'



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రఫి

నంద్యాల (నూనెపల్లె), మే 19: జిల్లాలోని కార్పొరేట్, ప్రవేటు విద్యాసంస్థల్లో వేసవి సెలవుల్లో నిర్వహిస్తున్న ముందస్తు అడ్మిషన్లను, అలాగే దోపిడీని అరికట్టాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎండీ రఫి డిమాండ్ చేశారు. ఆదివారం నంద్యాలలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రఫి మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యాసంస్థల ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి అడ్మిషన్లను చేపడుతున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో పాఠ్య పుస్తకాలను అమ్ముతూ వ్యాపార కేంద్రాలుగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. వేసవి సెలవుల్లో పదవ తరగతి, ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారని, వాటిపై అధికారులు చర్యలు చేపట్టక పోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు షాహిద్, వినోద్, బాలాజి తదితరులు పాల్గొన్నారు.

ఆ భూములు పండేదెన్నడో?

- 40 ఏళ్లకు పైగా గింజ పండని వైనం
- చెంతనే గంగ ఉన్నా చెంచులకు తీరని బెంగ



పంటకు నోచుకోని చెంచుల భూములు

బండిఆత్మకూరు, మే 19: అడవి బిడ్డలకు 40 ఏళ్ల క్రితం ఇచ్చిన భూములు నేటి వరకు పంటకు నోచుకవటం లేదు. మండలంలోని నారపురెడ్డి కుంటలో 60 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. దాదాపు 40 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం 28 మంది రైతులకు 60 ఎకరాల భూమిని ఇచ్చింది. అయితే ఆ భూములకు నేటి వరకు సాగు నీటి వసతి లేక పంటలకు నోచుకోవటం లేదు. గింజ పండింది లేదు, చెంచులు తినింది లేదంటే ఎంత చిత్రమో. చెంచులకు పూర్వమే కుంట ఉన్నా, నారపురెడ్డికుంట గూడేనికి కిలోమీటరు దూరంలో తెలుగుగంగ ప్రధాన కాలువలో 25 ఏళ్లకు పైబడే నీరు ప్రవహిస్తున్నా చెంచుల భూములు మాత్రం నేటికి బీడు భూములుగానే మిగిలి ఉన్నాయి. రెండు సంవత్సరాల క్రితం వీఆర్వో సంస్థ చెంచుల భూముల్లో మామాడి మొక్కలు నాటించింది. అయితే ఈ ఏడాది ఎండలు అధికంగా ఉండటంతో మొక్కలు వాడిపోతూ చనిపోతున్నాయి.

ఎవరికి చెప్పినా ఫలితం లేదు



గూడేనికి వచ్చిన ప్రతి అధికారికి, ప్రజాప్రతినిధులకు ఎన్ని సార్లు చెప్పినా ఎలాంటి ఫలితం లేదు. మాభూములన్నీ పండక బీడుబారిపోయాయి. నేటికి చెంచులు అనాది అలవాటు మేటి కింద సమీప గ్రామాల రైతుల పొలాలకు కావలి ఉండి పంట చేతికి అందిన తరువాత రైతులు పెట్టిన గింజలతో గంజి కాచుకొని జీవనం చేస్తున్నాం. గంగ నుంచి ఒక మోటరుతో కుంటకు నీరు అందిస్తే పంటలు పండుతాయి.

- బయన, నారపురెడ్డి కుంట

సాగుకు సిద్ధం

- పొలాలను దున్నుతున్న రైతులు
- గత సీజన్‌లో తీవ్రంగా నష్టపోయిన అన్నదాతలు



నాసిరకం విత్తనాలతో పసుపు రంగులో మారిన మినుము పంటను చూపుతున్న రైతులు (ఫైల్)



విత్తనానికి పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

నందికొట్కూరు రూరల్, మే 19: నందికొట్కూరు డివిజన్ పరిధిలో వర్షాలు కురుస్తుండడంతో రైతులలో ఆశలు మొలకెత్తాయి. పొలాలను విత్తనాలకు సిద్ధం చేస్తున్నారు. నందికొట్కూరు డివిజన్ పరిధిలో నందికొట్కూరు మండలం, మిడుతూరు మండలం, పాములపాడు, కొత్తపల్లె, పగిడ్యాల, జూపాడుబంగ్లా మండలాల పరిధిలో దాదాపుగా 25 వేల హెక్టార్లలో వివిధ రకాల పంటలను వేయడానికి రైతులు పొలాలను సిద్ధం చేస్తున్నారు. రైతుల పొలాలలో ఎక్కడ చూసినా రైతు కూలీలతో సందడి కనిపిస్తోంది. గత సంవత్సరం ఎక్కువగా పత్తి, మినుము, మొక్కజొన్న పంటలు సాగు చేశారు. కానీ అకాల వర్షాలకు కొంత, పంటల మధ్యలో వర్షాలు లేక కొంత, నాసిరకం విత్తనాలతో మరికొందరు రైతన్నలు తీవ్రంగా నష్టపోయారు. వైసీపీ ప్రభుత్వం రైతులను ఆదుకోలేకపోయింది. పండించిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేయడానికి కేంద్రాలు ఏర్పాటు చేయలేకపోయింది.

ఈసారైనా రాయితీ విత్తనాలు అందేనా?

గత సంవత్సరం ఖరీఫ్ మొదలు, రబీ కాలంలో కూడా రైతన్నలకు ప్రభుత్వం అందించే రాయితీ విత్తనాలు వైసీపీ ప్రభుత్వం అందజేయలేకపోయింది. గ్రామాలలో ఆర్భాటంగా ఆర్‌బీకేలను ఏర్పాటు చేసినప్పటికీ రైతులకు ఏవిధంగానూ సహాయ సహకారాలు అందించలేకపోయింది. ప్రతి సంవత్సరం రైతులకు మొక్కజొన్న, మినుములు, వరి, వేరుశనగ, కంది విత్తనాలను సహకార సొసైటీల ద్వారా ప్రభుత్వ రాయితీపై వ్యవసాయ అధికారులు అందజేసేవారు. ప్రస్తుత ఖరీఫ్‌లో రైతులు విత్తనాలు విత్తుకొనే సరైన సమయానికి ప్రభుత్వ రాయితీ విత్తనాలను అందిస్తే బాగుటుందని రైతులు ఎదురుచూస్తున్నారు.

నాసిరకం విత్తనాల బెడద తీరేనా?

గత సంవత్సరం ఖరీఫ్ కాలంలో జిల్లా వ్యాప్తంగా ప్రత్తి రైతులు నాసిరకం విత్తనాలతో భారీగా నష్టపోయిన సంగతి అందరికీ తెలిసిందే. అలాగే నందికొట్కూరు, పాములపాడు, జూపాడుబంగ్లా మండలాల పరిధిలో మినుము పంట సమయం పూర్తికాకముందే పసుపు రంగులోకి మారి రైతులను తీవ్రంగా దెబ్బతీసింది. ఈ రకంగా నాసిరకం విత్తనాలను రైతులకు అంటగట్టి సొమ్ముచేసుకునే విత్తనాల డీలర్లపై ఎలాంటి చర్యలు తీసుకోలేకపోయారు. నామ మాత్రపు తనిఖీలతో వ్యవసాయ అధికారులు సరిపెడుతూ ఎక్కడా ఒక్క డీలరు పైన చర్యలు తీసుకున్న దాఖలాలులేవు. రైతులకు చాలా నష్టం వాటిల్లింది. అయినప్పటికీ వ్యవసాయ అధికారులు, అధికార పార్టీ నాయకులు ఎవరూ రైతులను ఆదుకోలేకపోయారు. ఈ సంవత్సరమైనా ఈ నాసిరకం విత్తనాల బెడద నుంచి రైతులను ఆదుకోవాలని రైతన్నలు కోరుతున్నారు.

ఏడాదికే రోడ్లకు పగుళ్లు

- రూ.2 కోట్లతో రహదారుల నిర్మాణం
- ఐదు నెలల క్రితమే ప్రారంభించిన ఎమ్మెల్యే



బండిఆత్మకూరు, మే 19: సరిగ్గా నిర్మించి ఏడాది కాలం కాకమేందే రోడ్డు పొడవునా పగుళ్లు ఇచ్చాయంటే నిర్మాణ నాణ్యత ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. మండలంలోని పార్నపల్లె, ఎర్రగుంట్ల రహదారి పంచాయతీరాజ్ ప్రాజెక్ట్ కింద రూ.2 కోట్లకు పైగా నిధులు వెచ్చించి ఏడాది క్రితం నిర్మించారు. ఈ రోడ్డును ఎమ్మెల్యే శిల్పా ఐదు నెలల క్రితమే ప్రారంభించారు. అయితే నేడు ఆ రహదారి ఎక్కడ చూసినా, రోడ్డు పొడవునా చీలికలే ఏర్పడ్డాయి. వెట్ మిక్స్ పరుపు అనంతరం సరైన రోలింగ్ లేకపోవటం, చీలికలు రావటం, గుంతలు పడటం చూస్తే కోట్లాది రూపాయల నిధులను అధికారులు సైతం తమ పర్సెంటేజీల మాయలో పడి నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.



పగుళ్లు ఇచ్చిన పార్నపల్లె, ఎర్రగుంట్ల రోడ్డు

నేటి నుంచి లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు



మిడుతూరులోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం

మిడుతూరు, మే 19: మిడుతూరులో వెలసిన లక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలను సోమవారం నుంచి నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు, ఉత్సవ సభ్యులు చెప్పారు. రాత్రి మహాగణపతి పూజ, శ్రీ చక్ర రాజపూజ, నవగ్రహ మండపపూజ, అంకురారోపణ కార్యక్రమాలు నిర్వహంచనున్నారు. మంగళవారం తెల్లవారు జామున స్వామివారి కల్యాణోత్సవం, అదేరోజు శేష, హనుమ వాహన ఉత్సవాలు, 22వ తేదీ సింహ, గరుడోత్సవ సేవలు, 23న రథోత్సవం, 24న ఉదయం తీర్థావళి, పూర్ణాహుతి, సాయంత్రం పారువేట కార్యక్రమం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. మిడుతూరు గ్రామం అంటేనే చెన్నకేశవస్వామి దేవాలయం ఒక ప్రధాన సూచిక. ఆలయానికి దాదాపు 130 ఎకరాల మాన్యం భూములు ఉన్నాయి. వీటిని 3 ఏళ్లకోసారి వేలం పాట నిర్వహించి వచ్చిన సొమ్ముతో ఆలయ అభివద్ధి, బ్రహ్మోత్సవ కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు.

ఆలయ చరిత్ర

13వ శతాబ్దంలో నిర్మించిన లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయానికి ఎంతో ప్రత్యేకత ఉంది. 108 ఆలయాలలో 108వ తిరుపతిగా మిడుతూరు చెన్నకేశవస్వామి దేవాలయం పిలవబడుతోంది. పరిక్షిత్ మహారాజు కుమారుడు జనమేజయరాజు తన తండ్రి శాప విమోచనానికి ప్రతిరూపంగా ఆలయం నిర్మించినట్లు, సూర్యోదయం నుంచి సూర్యాస్తమం వరకు జనమేజయరాజు 108 చెన్నకేశవస్వామి ఆలయాలను నిర్మించినట్లు దేవాలయంలోని శాసనాలు చెబుతున్నాయి. అప్పట్లో గర్భగుడి, ఆలయ ప్రహరీ, సింహద్వారాన్ని నిర్మించారు. ఈ ఆలయాన్ని సందర్శించేందుకు వచ్చిన శాలివాహన రాజులు ఆలయం ముందు భాగంలో ఉన్న ప్రాకారాన్ని నిర్మించినట్లు చెబుతుంటారు. ప్రాకారంపై దేవతామూర్తుల ప్రతిమలను మిడుతూరుకు చెందిన జక్కుల శేషన్న కుమారుడు శిల్పి పెద్ద నారాయణ అనే వ్యక్తి 1969లో నిర్మించారు. బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు రథాన్ని (తేరును) 1955వ సంవత్సరంలో ఏర్పాటు చేశారు. గ్రామంలో ఉత్సవమూర్తులను తీసుకునివెళ్లేందుకు శేష, గరుడ, హనుమ, సింహ, అశ్వ, గజవాహనాలను ఆలయానికి దాతలు అందించారు.

ఆలయ ప్రత్యేకత.

చెన్నకేశవస్వామి ఆలయానికి ఎంతో ప్రత్యేకత ఉంది. ఆలయంపై సుర్వాంగ సుందరమైన శిల్పకళ అప్పటి కళా నైపుణ్యను వుట్టి పడేవిధంగా ఏర్పాటు చేశారు. ఉగాది మహాపర్వదినాన సూర్యాస్తమయంలో సూర్యుని కిరణాలు స్వామి పాదాలను అభిషేకించడం మరో ప్రత్యేకత.

'బాటిళ్లలో పెట్రోల్ విక్రయించొద్దు'

ఆత్మకూరు, మే 19: ఆత్మకూరు ప్రాంతంలోని పెట్రోల్ బంకుల యజమానులు బాటిళ్లలో పెట్రోల్, డీజిల్ విక్రయించొద్దని ఆత్మకూరు అర్బన్ సీఐ లక్ష్మీనారాయణ ఆదేశించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పెట్రోల్ బంకుల వద్ద బాటిళ్లలో డీజిల్, పెట్రోల్ విక్రయించవద్దని సూచించారు. కేవలం వాహనాల్లో మాత్రమే ఇంధనం నింపాలని తెలిపారు. జూన్ 16వ తేది వరకు ఈ నిబంధనలు అమల్లో ఉంటాయని చెప్పారు. ఇప్పటికే ఆత్మకూరు పోలీసు స్టేషన్ పరిధిలోని అన్ని పెట్రోల్ బంకుల యజమాన్యాలకు నోటీసులు జారీ చేయడం జరిగిందని వివరించారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్‌లను రద్దు చేస్తామని హెచ్చరించారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన

మిడుతూరు, మే 19: మిడుతూరు గ్రామంలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఆదివారం ఆరాధన మహోత్సవం కాతా రామచంద్రా రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అభిషేక తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ ఆవరణంలో విశేష అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బన్నూరు శ్రీనివాస రెడ్డి, కొండా నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి

నందికొట్కూరు, మే 19: పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సభను ఆదివారం నందికొట్కూరులోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. సుందరయ్య ఆశయాల కోసం పని చేద్దామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, రాజు, నాగన్న, గోకారి, మునిస్వామి, నజరున్నీసా తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: పాములపాడులోని సీపీఎం కార్యలయంలో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని నిర్వహించారు. ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య చిత్ర పటానికి నాయకులు బాలేసు, జగన్నాథరావు, సామన్న పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బాలయ్య, ఎస్ఆర్ రమణ, వెంకటేశ్వరరావు, ఏసేపు, నడిపి చెన్నయ్య, షర్ఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు

కొత్తపల్లి: పుచ్చలపల్లి సుందరయ్య జీవితం అందరికీ ఆదర్శప్రాయమని సీపీఎంమండల కార్యదర్శి నక్కస్వాములు, సంజీవరాయుడు, కేవీపీఎస్ జిల్లా నాయకులు సంపత్ అన్నారు. ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని మండలంలోని సింగరాజుపల్లి, చిన్నగుమ్మడాపురం, శివపురం, పెద్దగుమ్మడాపురం గ్రామాల్లో నిర్వహించారు. ముందుగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయ్‌కుమార్, నాయకులు దాసు, దేవకుమార్, గోపాల్, సూర్యుడు, ఎర్రన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: పుచ్చలపల్లి సుందరయ్యను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏసురత్నం, సీపీఎం సీనియర్ నాయకులు ఎ.రాజశేఖర్, పట్టణ కార్యదర్శి రణధీర్ పేర్కొన్నారు. ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. సమావేశంలో నాయకులు మంజుల, సురేంద్ర, స్వాములు, సుధాకర్, మాబాషా, వలి, ప్రభావతి, మేరమ్మ, భాస్కర్ తదితరులు ఉన్నారు.



సింగరాజుపల్లిలో నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

బండిఆత్మకూరు: పుచ్చలపల్లి సుందరయ్య అడుగుజాడల్లో నడుద్దామని సీపీఎం నాయకులు రత్నమయ్య, రామచంద్రుడు, డేవిడ్ పిలుపునిచ్చారు. బండిఆత్మకూరులో సుందరయ్య వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో రాజు, చెన్నమ్మ, సుబ్బరాయుడు, వెంకటలక్ష్మమ్మ, నాగరత్నమ్మ, శీను పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన మహానంది క్షేత్రం



మహానందిలో దర్శనం కోసం క్యూలో నిల్చున్న భక్తులు

మహానంది, మే 19: మహానంది క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. చిన్నారులకు వేసవి సెలవులతో పాటు వీకెండ్‌ను పురష్కరించుకొని భక్తులు తెలుగు రాష్ట్రాల నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి శనివారం రాత్రే తరలి వచ్చారు. దేవస్థానం వసతి గదులు, ప్రయివేట్ వసతి గదులు, కల్యాణ మంటపాల్లో భక్తులు విశ్రాంతి తీసుకొన్నారు. మరికొందరు భక్తులు వసతి గదులు దొరక్కపోవడంతో ఆలయ పరిసరాల్లోని ఆరు బయటే నిద్రించడం జరిగింది. తెల్లవారుజామున 5 గంటల నుంచే కోనేరుల్లో పుణ్య స్నానాలు నిర్వహించుకొనేందుకు మహా ముఖద్వారం వద్దకు చేరుకొన్నారు. అనంతరం పరమశివుడు, కామేశ్వరీదేవి ధర్శనం కోసం గంటల కొద్ది క్యూలో నిల్చొని దర్శించుకున్నారు. రాత్రి వరకు మహానందిలో భక్తుల రద్దీ కనిపించింది. దేవస్థానానికి వివిధ సేవల ద్వారా రూ.లక్షలాది ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

మహా నందీశ్వరుడి సన్నిధిలో దేవదాయశాఖ ఇంజనీరింగ్ అధికారులు



మహానందిలో దేవదాయశాఖ ఇంజనీరింగ్ అధికారుల బృందం

మహానంది, మే 19: మహానంది క్షేత్రంలో రాష్ట్ర దేవదాయశాఖ ఇంజనీరింగ్ అధికారుల బృందం ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ ముఖద్వారం ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో మహానందీశ్వరుడికి అభిషేకం, కామేశ్వరీదేవికి కుంకుమార్చన పూజలను భక్తి శ్రద్ధలతో జరిపారు. వీరిని ఆలయ వేదపండితులు ఆశీర్వదించారు. ఈవో శాలువాతో సన్మానించి, ప్రసాదాలు అందచేశారు. రాయలసీమ జిల్లాలోని ప్రధాన ఆలయాల అభివృద్ధిలో భాగంగా దాదావు రూ.200 కోట్లను దేవదాయశాఖ నిధులను మంజూరు చేసిందని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. వీటిని రికార్డుల తనిఖీల్లో భాగంగా కర్నూలులోని దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో సోమవారం వార్షిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్వామిని దర్శించుకున్న వారిలో హెడ్ ఆఫ్ ది ఇంజనీరింగ్ విభాగం బగిడి రవి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.గంగయ్య, రాయలసీమ మల్టీజోన్-2 ఇన్‌చార్జి ఎస్‌సీ సతీష్, డీఈఈ మెల్లంపూరి శ్రీనివాసప్రసాద్, ఇంజనీరింగ్ అధికారిణిలు ఉమాదేవి, జ్యోతి ఉన్నారు. వీరి వెంట ఆలయ ఏఈవో ఎర్రమల్ల మధు, మహానంది దేవస్థానం ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసులు యాదవ్ ఉన్నారు.

'ప్రతిభ ఉంటే అవకాశాలు పుష్కలం'



మహానంది లో సినీ నటుడు సంజయ్ దంపతులు

మహానంది, మే 19: ప్రతిభ ఉంటే తెలుగు చిత్ర పరిశ్రమలో అవకాశాలు పుష్కలంగా వస్తాయని తెలుగు చలన చిత్ర నటుడు సంజయ్ తెలిపారు. మహానంది క్షేత్రానికి దైవదర్శనం కోసం నటుడు సంజయ్ కుటుంబ సమేతంగా వచ్చారు. సంజయ్ మాట్లాడుతూ తాను 2013లో కాలిచరణ్ చిత్రం ద్వారా తెలుగు తెరకు పరిచయం అయినట్లు చెప్పారు. ఇప్పటి వరకు 50 చిత్రాల్లో వివిధ పాత్రలు పోషించినట్లు తెలిపారు. అయితే 2022లో వచ్చిన బలగం చిత్రంలో ప్రాధాన్యత గల పాత్ర పోషించడంతో తనను బలగం సంజయ్‌గా ప్రేక్షకులు పిలుస్తున్నారని అన్నారు. గతంలో పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన భీమ్లానాయక్, కాటమరాయిడు చిత్రాలతో పాటు బాలకృష్ణ, అఖండ, భగవత్‌కేసరి, జయసూర్య, చిరంజీవి ఆచార్య సినిమాల్లో తాను నటించినట్లు చెప్పారు. ప్రస్తుతం నితిన్ హీరోగా నటిస్తున్న తమ్ముడు చిత్రంతో పాటు భగవంతుడు తో పాటు మరో 8 చిత్రాలు, వెబ్ సీరీస్‌లో నటిస్తున్నట్లు నటుడు సంజయ్ తెలిపారు. సినీ రంగంలో పోటీ ఎక్కువైందని అన్నారు. తనకు పరిశ్రమలో గాడ్‌ఫాదర్ అంటూ ఎవరూ లేరని పేర్కొన్నారు. భవిష్యత్తులో పూర్తి స్థాయిలో హీరోగా చేయాలని అనుకొంటున్నాని తెలిపారు.

లక్ష్మీనారసింహుడిని తాకిన సూర్యకిరణాలు

- ఉత్తరాయణంలో విశేషం



లక్ష్మీనారసింహుడిని తాకిన సూర్యకిరణాలు

ఆత్మకూరు, మే 19: ఆత్మకూరు ప్రాంతంలోని నల్లకాల్వ లక్ష్మీనరసింహ స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌ను సూర్యకిరణాలు స్పర్శించాయి. తూర్పు ద్వారంగా దర్శనభాగ్యం కల్గించే స్వామి, అమ్మవార్లపై ఉత్తరాయనంలో సూర్యకిరణాలు ప్రసరించడం విశేషంగా భక్తులు భావిస్తారు. ఉత్తరాయణంలోని పుష్యమాసం నుంచి ఆషాడమాసం వరకు ఉదయం 6.30గంటల నుంచి 7గంటల సమయం మధ్యలో ఈ అపురూపమైన దృశ్యం సాక్ష్యాత్కరిస్తోంది. కాగా ఎక్కడ లేనివిధంగా నల్లకాల్వ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లు పానిమట్టంపై లింగాకృతిలో ఉన్న శిలపై కొలువుతీరి భక్తులచే పూజలందుకుంటున్నారు. గర్భాలయం ఎదుట 120 అడుగుల దూరం ముఖ, కల్యాణ మంటపాలు ఉన్నప్పటికీ వాటిని దాటి సూర్యకిరణాలు గర్భాలయంలోని మూలవిరాట్‌పై ప్రసరించడం అద్భుతమని చెబుతారు. ఈ కిరణాలు స్వామి, అమ్మవార్లపై పడటంతో గర్భాలయ గోడలపై మూలవిరాట్ నీడ ప్రతిబింబిస్తోంది. ఈ దృశ్యాన్ని తిలకించేందుకు ఉత్తరాయణ మాసాల్లో ఉదయాన్నే భక్తులు ఆలయానికి విశేషంగా తరలివస్తుండటం గమనార్హం.

బొప్పాయి ధర పతనం

● వైరస్‌తో తగ్గిన దిగుబడి ● బొప్పాయి తోటలను దున్నేస్తున్న రైతులు



చాగలమర్రి, మే 19: బొప్పాయి ధర పతనమైంది. దీంతో పెట్టుబడి కూడా రావడం లేదని రైతులు దిగాలు చెందుతున్నారు. ఆయా గ్రామాల్లో 300 ఎకరాల్లో బొప్పాయి సాగు చేశారు.ధరలు లేకపోవడంతో మండలంలోని చిన్నవంగలి, చాగలమర్రి తదితర గ్రామాల్లో బొప్పాయి పొలాలను దున్నేస్తున్నారు. ఎకరాకు రూ.50 వేలు నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టి సాగు చేసిన ఈ పంట వైరస్ మూలంగా ఆకులు ముడుచుకపోయి పండుబారాయి. దీంతో దిగుబడి రావడం లేదు. ఎకరాకు 30 టన్నులు దిగుబడి రావాల్సి ఉండగా కేవలం 10 టన్ను లు మాత్రమే వస్తోంది. పెట్టుబడి కూడా చేతికందే పరిస్థితి లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. గత నెల టన్ను రూ.14 వేలు ధర పలికింది. ప్రస్తుతం రూ.8 వేలకు పడిపోయింది. దీంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. కాయలు పక్వానికి వచ్చి కోత కోసే సమయంలో ధరలు పతనమై రైతులు నష్టపోతున్నారు. పెట్టుబడి రూపంలో రూ.2 కోట్ల దాక నష్టం వాటిల్లిందని రైతులు అంటున్నారు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకునేందుకు సిద్ధపడ్డారు. రైతులు ఇన్ని ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వం ద్వారా ఉద్యాన పంటలకు రాయితీలు అందడం లేదని అన్నారు. నష్టపోయిన బొప్పాయి తోటలకు పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ధర లేక నష్టపోతున్నాం



ఐదెకరాలు కౌలుకు తీసుకొని బొప్పాయి తోట సాగు చేశా. ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి పెట్టా. వైరస్ సోకడంతో చెట్లు దెబ్బతింటున్నాయి. దిగుబడి కూడా తగ్గిపోయింది. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చేలా లేదు. ధర ఒక్కసారిగా పతనమైంది. దీంతో భారీగా నష్టపోవాల్సి వస్తోంది.

\- నాగేశ్వర్‌రెడ్డి, కౌలు రైతు, చాగలమర్రి

రాయితీ కల్పించాలి



ఉద్యాన పంటలకు రాయితీ కల్పించాలి. ఎకరన్నర పంట సాగు చేశారు. రూ.2 లక్షలు పెట్టుబడి పెట్టా. వైరస్ వల్ల దిగుబడి తగ్గింది. పెట్టిన పెట్టుబడి రాక పోవడంతో బొప్పాయి తోటను దున్నేశా. ప్రభుత్వం రాయితీ కల్పించి ఆదుకోవాలి.

\- సంజీవరెడ్డి, రైతు, చిన్నవంగలి

మానవత సంస్థకు వైకుంఠ శాంతి రథం



వైకుంఠ శాంతిరథానికి పూజలు నిర్వహిస్తున్న దాతలు

సంజామల 19: మండలంలోని మానవత స్వచ్ఛంద సేవాసంస్థకు రూ. 8 లక్షలు విలువ చేసే వైకుంఠ శాంతిరథాన్ని విరాళంగా అందజేశారు. పేరుసోముల గ్రామానికి చెందిన భైసాని క్రిష్ణమూర్తి, సుబ్బరత్నమ్మ చారిట్రబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వారి కుమారులు భైసాని సుబ్రహ్మణ్యం అండ్ బ్రదర్ మానవత సేవా సంస్థకు ఆదివారం అందజేశారు. గ్రామంలోని శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి ఆలయంలో అర్చకులు శ్రీనివాసచార్యులు ఆధ్వర్యంలో వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మానవత సేవా సంస్థకు అందజేశారు. ఈ శాంతి రథాన్ని పేరుసోముల గ్రామంతో పాటు పరిసర గ్రామాలలోని ప్రజలు వినియోగించుకోవచ్చని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు మేడా హరిప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో సేవాసంస్థ ట్రెజరర్ నరసింహ మూర్తి ,ముక్కమళ్ళ మాజీ సర్పంచ్ పోచా వెంకట్రామి రెడ్డి, బెలుం సురేష్ రెడ్డి, శంకర్ రెడ్డి, తులసి రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, శేఖర్ రెడ్డి, ముక్కమళ్ళ మద్దిలేటి, శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు

బేతంచెర్ల, మే 19: ఇంటర్మీడియట్, పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఈ ఏడాదిలో అత్యధిక మార్కులు సాధించి ప్రతిభ కనబరిచి ఉత్తీర్ణత సాధించిన ఆర్యవైశ్య విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఆర్యవైశ్యులు ఆదివారం సన్మానించారు. ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో గుండా మహానాగ వాసవి 984 మార్కులు, కందుకూరు అక్షయ సాయి 979, అనుముల కనిష్క 954, అనుముల దక్షయ్ 951 మార్కులు సాధించి ఉత్తీర్ణులయ్యారు. అలాగే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలో అలువాల మధు పావని 590 మార్కులు, జక్కాశ్రీవల్లి 577, భీమిశెట్టి నవనీత్ 570 మార్కులు సాధించి ఉత్తీర్ణతతో ప్రతిభను కనబరిచిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను శాలువలతో మెమెంటోలతో ఆర్యవైశ్య ప్రముఖులు గుండా గోపాల్, కందగడ్డల మోహన్‌రావు, గుండా జయచంద్రలతో పాటు ఆర్య వైశ్య సంఘాల నాయకులు సన్మానించారు.

21 నుంచి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు



డోన్(రూరల్), మే 19: డోన్ మండలం యాపదిన్నె గ్రామంలో 21 నుంచి 23వ తేదీ వరకు లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. 21న స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. 22న స్వామివారి కల్యాణోత్సవం, రథోత్సవ కార్యక్రమాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా 22న రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలు

డోన్(రూరల్), మే 19: పట్టణంలోని తారకరామ నగర్‌లో ఈ నెల 20 నుంచి 28వ తేదీ వరకు రేణుకా ఎల్లమ్మ అమ్మవారి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ధర్మకర్తలు ఆకుతోట లక్ష్మీదేవి, ఆకుతోట చిన్న ఎల్లయ్య తెలిపారు. 8 రోజుల పాటు అమ్మవారి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయనీ తెలిపారు. భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ధర్మకర్తలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన



చాగలమర్రిలో అమ్మవారికి కుంకుమార్చన చేస్తున్న మహిళలు

చాగలమర్రి, మే 19: చాగలమర్రి గ్రామంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం వాసవీమాత జయంతి ముగింపు సందర్భంగా మహిళలు సామూహికంగా భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన చేశారు. ఎస్ఎస్ఎఫ్ మహిళా కన్వీనర్ భవానమ్మ ఆధ్వర్యంలో వాసవీమాతకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సామూహిక ఒడిబియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. వెండి రథంలో అమ్మవారి ఉత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు లక్ష్మణబాబు, మహిళలు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణ



చెన్నకేశవ ఆలయంలో ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న వేద పండితులు

చాగలమర్రి, మే 19: మండలంలోని కుందూనది తీరంలో వెలసిన చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం ధ్వజారోహణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కుందూనది జల కలశాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని దేవతా మూర్తులకు జలాభిషేకం నిర్వహించారు. అనంతరం చెన్నకేశవ, సంజీవరాయ ఉత్సవమూర్తులను ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, ఈవో నర్సయ్య పాల్గొన్నారు.

యువత దేశ పరిరక్షణకు ముందుకు రావాలి



ప్యాపిలిలో విశ్వహిందూ పరిషత్ నాయకులు

ప్యాపిలి, మే 19: యువత దేశ పరిరక్షణకు ముందుకు రావాలని జిల్లా విశ్వహిందూపరిషత్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని సరస్వతి శిశుమందిరంలో విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ దేశ, హిందు పరిరక్షణకు విశ్వహిందూ పరిషత్ పనిచేస్తున్నదని, యువతకు సంఘానికి తమ వంతు సహకారం అందించాలన్నారు. అలాగే ప్రతి హిందువు కూడ సనాతన ధర్మాన్ని పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు నరేష్‌కుమార్, రవిసింగ్, రాంప్రతాప్, దేవీదయానంద్‌సింగ్, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా గ్రామోత్సవం

ప్యాపిలి, మే 19: పట్టణంలోని సాయిబాబా వార్షికోత్సవ వేడుకల్లో బాగంగా ఆదివారం బాబా విగ్రహ గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంతకు ముందుగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఉత్సవంలో ఏర్పాటు చేసి మేళతాళాలు, భజనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొత్త వ్యక్తులు గ్రామాలను వదిలి వెళ్లాలి

ఆళ్లగడ్డ, మే 19: కొత్త వ్యక్తులు గ్రామాలను వదిలి వెళ్లాలని డీఎస్పీ షర్ఫుద్దీన్ సూచించారు. ఆళ్లగడ్డ పట్టణ శివార్లలోని టిడ్కోలలో కొత్త వ్యక్తుల కోసం, మారణాయుధాల కోసం రాష్ట్ర, జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం కార్డన్ సెర్చ్ కార్యక్రమాన్ని పట్టణ సీఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో భారీ ఎత్తున పోలీసు బలగాలతో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఎలాంటి మరణాయుధాలు, కొత్త వ్యక్తులు లభించలేదు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంతనాయక్, ఎస్ఐ నరసింహులు, శిరివెళ్ల, రుద్రవరం ఎస్ఐలు, సీఐలు పాల్గొన్నారు.

'వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి'

చాగలమర్రి, మే 19: గ్రామాల్లో ప్రజలు సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు ఇమ్రాన్ సూచించారు. వర్షాలు కురుస్తుండటంతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని, మురుగు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. దోమల నివారణకు పంచాయతీ అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. వ్యాధులు సోకిన వెంటనే వైద్య చికిత్సలు చేయించుకోవాలన్నారు. ప్రతి బుధవారం నిర్వహించే ఇమ్యూనైజేషన్ టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా వైద్య చికిత్సలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, వైద్య సిబ్బంది ఉన్నారు.

పెద్దమ్మకు పూజలు

చాగలమర్రి, మే 19: చాగలమర్రి గ్రామంలోని పెద్దమకానం వీధిలో వెలసిన పెద్దమ్మకు ఆదివారం ఘనంగా ప్రత్యేక పూజలు చేశారు. మహిలు బోనాలను సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. లోక కల్యాణార్థం ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుతూ పెద్దమ్మకు పూజలు చేశారు. అలాగే చాగలమ్మ, గంగమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు

రుద్రవరం, మే 19: మండలంలోని యల్లావత్తుల, చిన్నకంబలూరు, కొండమాయపల్లె, రుద్రవరం గ్రామాల్లో ఆదివారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. పెద్దమ్మ, మారెమ్మ, సుంకులమ్మ అమ్మవార్లకు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. మహిళా భక్తులు చీరలు, బోనాలు సమర్పించారు.

'ధర్మ ప్రచారం అందరి బాధ్యత'

చాగలమర్రి, మే 19: ధర్మ ప్రచారం అందరి బాధ్యతని అభినవ శంకరానందస్వామి అన్నారు. ఆదివారం చాగలమర్రి శివరామానంద ఆశ్రమంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని సూచించారు. హిందూవులు ధర్మ ప్రచారాన్ని గడపగడపకు చేరవేయాలని అన్నారు. ప్రతి ఒక్కరూ దైవ మార్గంలో నడవాలని, శాంతియుత జీవనం గడపాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ సంఘం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వర్షానికి తడిసిన వరి ధాన్యం

రుద్రవరం, మే 19: రుద్రవరం మండలంలో శనివారం రాత్రి వర్షం కురిసింది. ఆలమూరు గ్రామ సమీపంలో రోడ్డు వెంట ఆరబోసిన వరి ధాన్యం తడిచిపోయింది. అకాల వర్షంతో రైతులకు చేతికందిన వరి పంట తడిచింది. వరి ధాన్యం రంగుమారితే రేటు పలుకుతుందో లేదో నని రైతులు ఆందోళన పడుతున్నారు. చేతికందిన పంట తడిచిపోవడంతో నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

బనగానపల్లె, మే 19: బనగానపల్లె పట్టణంలోని శాఖా గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని శాఖా గ్రంథాలయాధికారి బషీర్ అహమ్మద్ ఆదివారం తెలిపారు. గ్రంథాలయాలో ఈనెల 15 నుంచి జూన్ 7 వరకు విద్యార్థులకు వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణా తరగతుల్లో పిల్లలకు చిన్నచిన్నకథలు చెప్పించడం, మానసిక వికాసానికి క్యారమ్స్, చెస్ తదితర గేమ్స్ కూడా నేర్పిస్తున్నట్లు తెలిపారు. రిటైర్డు హెచ్ఎం శ్రీరాములు మరియు బాలికల హైస్కూల్ ఉపాధ్యాయుడు శివరాం ఆధ్వర్యంలో ఈకార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయుల ఉపాన్యాసాల ద్వారా విద్యార్థుల సృజనాత్మక శక్తిని పెంచేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

బనగానపల్లె, మే 19: బనగానపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరుకోవడానికి ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీలో ఇంగ్లీషు, తెలుగు మీడియంలో చేరడానికి దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ సత్యప్రపూర్ణ ఆదివారం తెలిపారు. పదోతరగతి పాస్ అయిన విద్యార్థులు తమ దరఖాస్తులు ఈనెలాఖరులోగా దరఖాస్తులు అందించాలని కోరారు.

డయల్ యువర్ డీఎం

కోవెలకుంట్ల, 19: కోవెలకుంట్ల ఆర్టీసీ డిపో పరిధిలో ప్రజారవాణా సమస్యలపై ఈ పెలా 21 మంగళవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తిరుపతయ్య ఆదివారం తెలిపారు. కోవెలకుంట్ల డిపో పరిధిలో ఏవైన సమస్యలుంటే 9959225798కు తెలియజేయాలని కోరారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి



పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

డోన్(రూరల్), మే 19: పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని ఆదివారం సీపీఎం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు నరసింహులు, రామచంద్రుడు, నక్కి శ్రీకాంత్, చిన్న రెహిమాన్, శివరాం, వెంకటసుబ్బారెడ్డి, భాస్కర్ రెడ్డి, మాణిక్యంశెట్టి తదితరులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: కార్మిక, కర్షక, పేదల పక్షపాతి పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం నాయకుడు సుధాకర్ పేర్కొన్నారు. ఆదివారం కోవెలకుంట్ల పట్టణంలోని ప్రొఫెషనల్ కొరియర్ కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో అల్లావుద్దీన్,మద్దిలేటి, దిబ్బరాజు, రవికుమార్ పాల్గొన్నారు.

ఉపాధిలో పూల సాగుకు అవకాశం

కొలిమిగుండ్ల రూరల్, మే 19: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రభుత్వం పూల సాగుకు అవకాశం కల్పిస్తోందని కొలిమిగుండ్ల మండల ఏపీవో గంగన్న ఆదివారం వెల్లడించారు. ఒక్కో రైతుకు ఒక ఎకరా పొలం వరకు పూల సాగుకు చేసుకోవచ్చునని, ప్రస్తుతం పూలకు మార్కెట్లో మంచి గిరాకీ ఉందన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు మామిడి, సపోట, చీనీ తదితర 16రకాల పండ్ల తోటల సాగు చేసుకోవచ్చునని తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు ఉపాధి అధికారులను సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి చెన్నకేశవ స్వామి ఉత్సవాలు

అవుకు, 19: పట్టణంలో వెలసిన భూలక్ష్మి సమేత లక్ష్మీచెన్న కేశవ స్వామి తిరు కల్యాణ మహోత్సవాలు సోమవారం నుంచి గ్రామ రైతుసంఘం ఆధ్వర్యంలో ప్రారంభం కానున్నయి. సోమవారం రాత్రికి సంకల్పం, పుణ్యాహవచనం, ధ్వజారోహణ, అంకురార్పణ, కలశ స్థాపన, మంగళవారం తెల్లవారుజామున భూలక్ష్మి సమేత లక్ష్మీచెన్న కేశవ స్వామి తిరు కల్యాణ,రాత్రికి హనుమంతు వాహనసేవ, 22న సింహవాహన సేవ , 23న శేషవాహన సేవ, 24న కాసుల మహనందమ్మ గారి పేరున జరుపుతారు. బ్రాహ్మణ సంతర్పణ, రాత్రికి గరుడ వాహనసేవ, 25న గజవాహన సేవ, 26న సాయంత్రం రథోత్సవం, 27న తేరు వెనుకకు లాగుట, 28న ధ్వజారోహణం, వసంతోత్సవం కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు గ్రామరైతు, సంఘం పెద్దలు తెలిపారు.

యాగంటిని దర్శించుకున్న జేసీ



యాగంటి ఉమామహేశ్వరుని దర్శించుకున్న జేసీకి జ్ఞాపికను అందిస్తున్న ఆలయ సిబ్బంది

బనగానపల్లె, మే 19: మండలంలోని యాగంటి ఉమామహేశ్వరస్వామిని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. జేసీకి ఆలయ ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, ఛైర్మన్ తోట బుచ్చిరెడ్డి, తహసీల్దారు రవీంద్రారెడ్డి, ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. యాగంటి ఉమామహేశ్వరస్వామికి జేసీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారాంతపు సెలవు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు ఉమామహేశ్వరస్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

రుద్రవరంలో భారీ వర్షం

రుద్రవరం, మే 19 : రుద్రవరం మండలంలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. పంట పొలాల్లో వర్షం నీరు నిల్వ చేరింది. వీధుల వెంట వర్షం నీరు ప్రవహిస్తుంది. ఎక్కడ చూసినా పొలాల్లో వర్షం నీరు నిలవ చేరి జలకళ సంతరించుకుంది. ఎండిపోయిన వాగులు ,వంకల్లో నీరు గలగల ప్రవహిస్తుంది. రైతులు వర్షం కురియడంతోహర్షం వ్యక్తం చేశారు

రోడ్డుపై మురుగు



చాగలమర్రి, మే 19: మండలంలోని తోడెండ్లపల్లె గ్రామంలో రహదారులు బురదమయంగా మారాయి. కొద్దిపాటి వర్షానికే రహదారులు అధ్వానంగా మారాయి. రహదారులపై వర్షపు నీరు నిలిచి కుంటలను తలపిస్తున్నాయి. మురికి కాలువలు లేక పోవడంతో రహదారులపైనే మురుగు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. ప్రజలు ఆ నీటిలోనే రాకపోకలు చేయాల్సి వస్తోంది. దోమలు అధికమై వ్యాధుల బారిన పడాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. ఇలాగైతే రోగాలు రావా? అంటూ ప్రజలు ఆవేదన చెందుతున్నారు. మురుగు పోయేలా, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా రహదారి



ముత్యాలపాడు నుంచి డి. వనిపెంటకు వెళ్లే రహదారి దుస్థితి

చాగలమర్రి, మే 19: మండలంలోని ముత్యాలపాడు నుంచి డి.వనిపెంట గ్రామానికి వెళ్లే రహదారి కంకర తేలి అధ్వాన స్థితికి చేరింది. దాదాపు 5 కిలోమీటర్ల మేర ఇదే పరిస్థితి ఉండటంతో వాహనదారులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. గతంలో తారు రోడ్డు నిర్మాణం చేపట్టినా శిథిలావస్థకు చేరడంతో వాహనదారులు, ఆయా గ్రామస్థులు నరకయాతన పడుతున్నారు. డి.వనిపెంట నుంచి కొత్తపల్లె, గొడిగనూరు రహదారి కూడా అధ్వానంగా మారింది. అధికారులు స్పందించి రహదారుల మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అసంపూర్తిగా కాలువ లైనింగ్



తెలుగుగంగ ప్రధాన కాలువలో అసంపూర్తిగా ఉన్న లైనింగ్ పనులు

రుద్రవరం, మే 19: తెలుగుగంగ ప్రధాన కాలువ లైనింగ్ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. మండలంలోని డి.కొట్టాల సమీపంలోని 17బ్లాక్ చానల్ తూముకు ఎదురుగా ప్రధాన కాలువలో అసంపూర్తిగా నిలిపివేశారు. కాలు ఇలా ఉంటే సాగునీరు పారేదెలా అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మాత్రం వేసవిలో పనులు చేయకుండా నిర్లక్ష్యం వహించారని రైతులు ఆరోపించారు. వ్యవసాయ పనులు ప్రారంభమైన వెంటనే పనులు చేసేందుకు హడావుడి తప్ప పనులు చేయరని రైతులు అంటున్నారు.

బ్రహ్మంగారి కాలజ్ఞానం ప్రపంచానికి ఆదర్శం



బ్రహ్మంగారి కాలజ్ఞానం పుస్తకాలు పంపిణీ చేస్తున్న బ్రహ్మనందాచారి

బనగానపల్లె, మే 19: వీరబ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞానం ప్రపంచానికే ఆదర్శం అని జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మనందాచారి అన్నారు. ఆదివారం మండలంలోని పలుకూరు గ్రామంలోని రామాలయంలో బ్రహ్మంగారి కాలజ్ఞానం విశిష్టత, భక్తిభావాల పుస్తకాలను ఆయన ప్రజలకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ భూత, భవిష్యత్, వర్తమానాలను ఖచ్చితంగా తెలియజేసిన మహా జ్ఞాని బ్రహ్మంగారు కొనియాడారు. తన కాలజ్ఞానం ద్వారా అనేక విషయాలను ప్రజలకు ముందుగానే చెప్పారన్నారు. రవ్వలకొండను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని, నేలమఠం ఆలయాన్ని అభివృద్ధి చేయాలని, ఏదో ఒక జిల్లాకు బ్రహ్మంగారి పేరు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్రహ్మంగారి భక్తబృందం అధ్యక్షుడు టీవీ. కొండలరావు, సెక్రటరీ రాజు, పూజారి శ్రీనివసాచులు, భజనమండలి అధయక్షుడు కెఈ వెంకటసుబ్బయ్యగౌడ్, బాలహనుమంతు, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు

బనగానపల్లె, మే 19: జగద్గురు మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి 331వ ఆరాధనోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఆరాధనోత్సవాల సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ప్రథమ పీఠం గరిమిరెడ్డి అచ్చమాంబ దేవస్థానం, రవ్వలకొండలోకి వీరప్పయ్యస్వామి ఆలయం వద్ద, నేలమఠం వద్దకు చేరుకొని ఆరాధనోత్సవాల్లో పాల్గొన్నారు. స్వామివారికి పంచామృతాభిషేకం, పల్లకీ సేవ, మహాప్రసాద వితరణ కార్యక్రమాలను ఆయా దేవస్థా నం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నేలమానుమఠం దేవస్థాన ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, చింతమానుమఠం ప్రధాన అర్చకు లు చిరంజీవాచార్యుల ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

సబ్సిడీపై జీలుగ, పిల్లిపెసర విత్తనాలు

కొలిమిగుండ్ల రూరల్, మే 19 : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు జీలుగ, పిల్లి పెసర, మినుము తదితర విత్తనాల కోసం ఆయా గ్రామాలకు చెందిన రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలని మండల వ్యవసాయాధికారి బి.జ్యోతి వెల్లడించారు. ప్రభుత్వం ఆయా రకాల విత్తనాలను 50శాతం సబ్సిడీ కింద పంపిణీ చేయడానికి అందుబాటులో ఉంచిందని అన్నారు.

ఘనంగా వాసవి మాత గ్రామోత్సవం



వాసవి మాతకు పూజలు చేస్తున్న ఆర్యవైశ్యులు, మహిళలు

బేతంచెర్ల, మే 19: పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవీ అమ్మవారిశాలలో వెలసిన వాసవి మాత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు కందగడ్డల మోహన్‌రావు, గుండాగోపాల్, గుండా జయచంద్రగుప్త, రాజేంద్ర కుమార్, ఆర్య వైశ్య మహిళలు పాల్గొన్నారు.